

# అక్కడే ఆగక

– మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

"**వివిధ భారతిలో ఉదయం** ఎనిమిదిన్నరనించి పదిన్నరదాకా తెలుగు పాటలు. ఆడవాళ్ళు వంటచేస్తూ తెలుగు పాటలని వినేవారు. వివిధ భారతిలో పాటలతోపాటు ప్రకటనలు. ఉదయం తొమ్మిది హోటల్ మమతావారి సమయం. 'నేను హార్లిక్స్ తాగను. తింటాను .హమామామా మామా హమాం సోప్ ప్రకటన.

'ఏమీ రామయ్యా విచారంగా ఉన్నావు? – మా ఇంటి పైకప్పుకి ఏం వేద్దామా అని ఆలోచిస్తున్నాను. చార్మినార్ ఏస్‌బెస్టాస్ ఉండనే ఉందిగా. ఓ పేకెట్ క్రేన్ వక్కపొడి ఇవ్వండి. ఒరు పేకెట్ క్రేన్ వక్కపొడి కొడుంగో. ఏక్ పేకెట్ క్రేన్ ఒక్కపొడి దేవో.. ఏమిటి? క్రేన్ వక్కపొడికి ఇంత డిమాండా? కట్టుకోడానికి పట్టు, పెట్టుబడులకి నూలు బట్టలు అంటే, 'పట్టు బట్టలు పెడితే కట్టుకోమన్నారా?' అని మా నాన్న అనేవారు. మధ్యాహ్నం రాగరాగిణి, సంగీత స్రవంతి. రాత్రి ఏడుకి జయమాలలో సైనికులు కోరిన పాటలు. పదికి ఛాయా గీత్‌లో హిందీపాటలు ప్రసారమయ్యేవి."

"అవును. రేడియో సిలోన్ కూడా మా అక్కతో పాటు వినేవాడిని. బుధవారం బినాకా గీత్‌మాలా, శనివారం ఏక్ ఔర్ అనేక్ గీతాలు, ఆదివారం సాజ్ ఔర్ ఆవాజ్. మరణించిన హిందీ ప్రముఖుల పుణ్య తిథికి ప్రత్యేక కార్యక్రమం. ఆఖరి పాట తప్పనిసరిగా కుందన్లాల్ సైగల్‌దే. రేడియో సిలోన్‌లో తరచు టైం చెప్పేవారు. నాకు ఇంకోటి గుర్తొస్తోంది. ఫిల్మ్ డివిజన్ సెన్సార్ సర్టిఫికేట్లో ఐఎన్నార్ నంబర్ చూసి, ఇదివరకు చూసామో లేదో గుర్తుపట్టేవాళ్ళం. బీహార్లో వరదలు. పార్లమెంట్ సమావేశాలు, భారత ప్రధాని టోక్యో పర్యటన మొదలైనవి వాటిలో చూపించేవారు. కుంభమేళా మొదలైన వాటికి స్పెషల్ డాక్యుమెంట్రీస్ ప్రదర్శించేవారు. ఇంట్రవెల్లో పాటల పుస్తకాలు, సోడాలు, బిస్కెట్ట్లు తెచ్చి అమ్మేవాళ్ళు. సినిమాలకి శతదినోత్సవలు జరిపేవారు. వాటికి హాజరయ్యే నటీనటులు బస చేసిన హోటళ్ళ బయటవారిని చూడాలని గంటల తరబడి నిలబడేవాళ్ళం. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికల్లో సీరియల్స్ బైండింగ్ చేయించుకునేవాళ్ళం. పరీక్షా ఫలితాలకి ఈవినింగ్ సింగిల్ పేజ్ స్పెషల్స్ విడుదలయ్యేవి. ఒక్కటే షీట్ రూపాయికి అమ్మేవారు. మా అన్నకి నేరో కట్ గొట్టం పేంట్, సైడ్ బర్న్స్, బెల్ బాటం పేంట్‌లు ఉండేవి. అక్కయ్యకి లంగా ఓణీ, పరికిణీలే. పంజాబీ డ్రస్ వేసేవాళ్ళు తక్కువ. శివరాత్రికి ఒకే టిక్కెట్ మీద రాత్రంతా సినిమాలు ప్రదర్శించెవారు. అన్ని థియేటర్లలో పోస్టర్స్ చూసుకుని, ఎక్కువ బావున్న వాటికి వెళ్ళేవాళ్ళం. ఇవ్వన్నీ మాయమయ్యాయి."

రాత్రి తొమ్మిదిదాకా మిత్రుడితో కాలక్షేపం చేసాక సంజీవ మనసు తేలిక పడింది. ఇంటికి కాలి నడకన వెళ్ళి మర్నాడు ఉదయం సూర్యచంద్ర ఇంటినించి బైక్ తెచ్చుకున్నాడు.

25

ఆద్య నిద్రలేచాక తన బాత్‌రూంలో అద్దం మీద అక్క పోస్టిట్‌లో రాసిన వాక్యం చదివింది.

'ఇవాళ మా ఆఫీస్‌లో కలిసి లంచ్ చేద్దాం. ఏం వండక.'

కాఫీ తాగుతూ టి.విలో ఊడూ బొమ్మలు, మంత్రగాడి గురించిన సౌత్ ఆఫ్రికన్ సినిమా చూసింది. ఓ తెగ చీఫ్ కూతుర్ని మంత్రగాడు ఎత్తుకుపోయాడు. అప్పటికే ఆమెని ప్రేమించిన ఓ యువకుడు ఆమెని చేసుకుంటానంటే తండ్రి తిరస్కరించాడు. ఆయన కుదిర్చిన పెళ్ళికొడుకు వెళ్ళి ఆమెని తీసుకురావడానికి ఒప్పుకోకపోవడంతో ప్రేమికుడు ఆ మంత్రగాడిని వెదుకుతూ వెళ్ళడందాకా చూసాక టి.విని ఆఫ్ చేసింది. ఆ హీరోయిన్ చాలా లావుగా, చాలా నల్లగా, బండ పెదాలతో అసలు బాలేదు.

చర్చ్ పాటలు వినపడటంతో తలుపు తాళం వేసి అక్కడకి బయలుదేరింది. తలుపుకి తాళం వేసాక గుర్తొచ్చి మళ్ళీ లోపలకి వెళ్ళి మస్కిటో రెపెల్లెంట్ రాసుకుని బయటకి వచ్చింది.

"గుడ్‌మార్నింగ్ డేనియల్" గార్డ్‌ని విష్ చేసింది.

ఎప్పటిలానే చర్చ్ గుమ్మం దగ్గర నుంచున్నతను ఆమెని చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"చెడ్డ పిల్లలందరికీ ఎర్రరంగు, మంచి పిల్లలందరికీ ఆకుపచ్చ రంగు వేయాల్సొస్తే మీ చర్మానికి ఏ రంగు వేయాలి? ఆలోచించండి. రెండే జవాబులు ఉన్నాయి. ఎరుపా? ఆకుపచ్చా?" ఆమె లోపలకి వెళ్ళేసరికి పాస్టర్ ప్రశ్నిస్తున్నాడు.

కొద్ది క్షణాలు ఆలోచించుకోడానికి వ్యవధిని ఇచ్చాక ఆయన కొనసాగించాడు.

"దీనికి తెలివైన మూడో సమాధానం కూడా ఉంది. ప్రతీవారి శరీరానికి ఎరుపు, ఆకుపచ్చ వేయాలి. జీసస్ తప్ప ప్రపంచంలోని ప్రతీవారు చెడ్డవారు, అదే సమయంలో మంచివారు కూడా. మంచిలో జీసస్‌లా, చెడులో సేటన్‌లా ఎవరూ సంపూర్ణులు కారు. మనమంతా కొన్ని సమయాల్లో, కొన్ని సందర్భాల్లో కొన్ని విషయాల్లో చెడుగా, అదే విధంగా మరికొన్ని సమయాల్లో, మరికొన్ని సందర్భాల్లో, మరికొన్ని విషయాల్లో మంచిగా ప్రవర్తిస్తూంటాం. అలాంటప్పుడు మరొకరి చెడ్డతనాన్ని ఎందుకు ద్వేషిస్తారు? ఇతరుల్లోని చెడ్డతనాన్ని ద్వేషించేవారు తమలోని చెడ్డతనాన్ని కూడా ద్వేషించుకోవాలి. ఇది న్యాయం. మన మనసులోని కొంతభాగం సదా వెలుగులో, మరికొంత భాగం సదా చీకట్లో ఉంటుంది. సదా వెలుగులోకి రావడానికి జీసస్ ఒక్కడే మార్గం."

'తను జినేంద్రని ద్వేషించడం సబబా?' అనే ప్రశ్న వెంటనే ఆద్యలో ఉదయించింది. కాని ఆకరి వాక్యం 'జీసస్ ఒక్కడే మార్గం'తో ఏకీభవించలేకపోయింది.

"మనలోని ప్రతీవారు ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకటి పోగొట్టుకున్నవారే. ఏదైనా దొరికినవారే. లాస్ట్ అండ్ ఫౌండ్. కాం అనే వెబ్‌సైట్ ఒకటుంది. అందులో పోయినవారు, దొరికిన వారు ఆ వివరాలని పోస్ట్ చేస్తారు. దానికి మొబైల్ యాప్ కూడా ఉంది. పోగొట్టుకున్నవారు దాని ద్వారా తిరిగి దాన్ని పొందే అవకాశం ఉంది. ఐతే పోయినవి పోస్ట్ అవడం ఎక్కువ. వాటిలో సగమే దొరికాయని పోస్ట్ అవుతూంటాయి. టెక్నాలజీ మనకి ఈ సహాయం చేస్తోంది. ఐతే ఆ వెబ్‌సైట్లోవన్నీ భౌతిక వస్తువుల గురించే. పోయిన మన ఆత్మ మాటేమిటి? పోయిన స్వర్గాన్ని మనం తిరిగి జీసస్ ద్వారానే కనుక్కోగలం. జీసస్.."

ఆద్యలో ఆ మాటలు ఆలోచనలని ప్రేరేపించాయి. తను తన ప్రేమని పోగొట్టుకోలేదు. తన వయసువల్ల స్వాభావికంగా తను ప్రేమలో పడ్డదనే భ్రాంతిలో ఉంది. చైత్ర చెప్పినట్లు అది హార్మోన్స్ వల్ల కలిగిన భాసంచలనం తప్ప తను నిజంగా జినేంద్రని ప్రేమించలేదు. అతన్ని కోల్పోయిందని కాదు తను బాధపడింది. మోసపొయ్యాననే భావనతో చింతించింది. తనలో అతనిమీద ప్రేమ ఉంటే, చింతించడానికి కారణం వేరుగా ఉండేది.

"మనలో అసలైన క్రిస్టియన్ ఎవరు? చక్కటి దుస్తులు ధరించిన ఓ యూరోపియన్ ధనికురాలు ఆఫ్రికాలోని సఫారీకి వెళ్ళింది. ఆమె గ్రూప్‌ని ఓ హాస్పిటల్‌కి సందర్శనకి తీసుకెళ్ళారు. ఆ కుష్టురోగుల ఒంటిమీద ఈగలు ముసురుతున్నాయి. ఓ నర్స్ చీముకారే ఓ రోగి పుళ్ళని తుడిచి కట్లు కట్టడం చూసిన ఆ యూరోపియన్ 'ప్రపంచంలోని డబ్బంతా ఇచ్చినా నేనీ పని చేయను' అన్నది. ఆ నర్స్ చిన్నగా నవ్వుతూ 'నేను కూడా' అన్నది."

దాన్ని అర్థం చేసుకునేందుకు కొన్ని క్షణాల విరామాన్నిచ్చి పాస్టరే కొనసాగించాడు.

"మదర్ థెరీసా కేవలం ఒక్క క్రిస్టియానిటీలోనే సాధ్యం. ఆవిడ మరో మతంలో పుట్టి ఉంటే, జీసస్ బోధనలు వినేది కాదు. మదర్‌గా మారేది కాదు. ఆ జవాబు కేవలం సిసలైన క్రిస్టియన్ మాత్రమే ఇచ్చే జవాబు. మరే మతం ఇలా తోటి జీవులకి సేవ చేయమని ప్రేరేపించదు. ఇక్కడ నాకోటి గుర్తుకి వస్తోంది. మహాత్మా గాంధీ విద్యార్థిగా లండన్‌కి వెళ్ళినప్పుడు 'సెర్మన్ ఆన్ ది మౌంట్'ని చదివాడు. అది నచ్చి క్రిస్టియానిటీ సంపూర్ణమతంగా భావించాడు. కాని ఆయన ఓ క్రిస్టియన్ కుటుంబంతో పేయింగ్ గెస్ట్‌గా ఉన్నాక వారెవరూ తమ మతాదర్శాల ప్రకారం జీవించకపోవడం గమనించాడు. దాంతో క్రిస్టియానిటీమీద తన మనసుని మార్చుకున్నాడు. ఏ మతమైనా దాని ఆదర్శాల ప్రకారం జీవిస్తేనే అది పరిపూర్ణమతమౌతుంది. ఆమెన్."

అందరితోపాటు ఆద్య కూడా 'ఆమెన్' అని గట్టిగా చెప్పింది.

తిరిగి వచ్చేప్పుడు తమ ఎదురింటి ముందు చాలా కార్లు ఆగి ఉండటం చూసింది. వర్షం పడకుండా గాజు ఆచ్ఛాదన గల గూటిలోని ఒకరి కలర్ ఫోటోని అప్పటికే రెండుసార్లు చూడటంతో ఆసక్తిగా దాని దగ్గరకి వెళ్ళి చదివింది. ఆ ఇంటి యజమాని ఏభై రెండేళ్ళ మిల్లర్ మేథ్యూస్ మరణించిన తేదీ అందులో ఉంది. నాలుగు నెలల తొమ్మిది రోజుల క్రితం. ఫ్యూనరల్ ఇంకా కాలేదు. బంధువులు ఫ్యూనరల్ గురించి చర్చించడానికి వచ్చారని ఎవరూ చెప్పకుండానే గ్రహించింది. ఆ రోజైనా వారికి ఏకాభిప్రాయం వస్తుందో, రాదో అనుకుంది. తను మరణించి తన శవాన్ని రెఫ్రిజరేషన్‌లో ఉంచితే, తన ఆత్మ దాని చుట్టూ తిరుగుతుందేమో అనుకోగానే భయం వేసింది. కాల్చేసే పద్ధతి మెరుగు అనుకుంది.

చైత్ర ఫోన్ చేసి చెప్పింది.

"ఏం చేస్తున్నావు? అరగంటలో బండి వస్తుంది. ట్రెడిషనల్‌గా కనిపిస్తుంది. కుర్తా, పైజమా వేసుకునిరా."

సైమన్ రాగానే కారెక్కింది. చైత్ర ఆఫీస్ ముందు దిగబోతూ కారు అద్దంలో తన మొహాన్ని చూసుకుంది.

అదో మూడంతస్థుల భవంతిలో ఉంది. లాబీలో వేచివున్న చైత్ర చెల్లెలిని చూడగానే అడిగింది.

"ఆకలేస్తోందా?"

"అంతగా లేదు."

"నా ఆఫీస్ రూం చూపిస్తా పద."

ఆ ఏర్‌కండిషండ్ గది ఓ మూలలో ఉండటంతో రెండువైపుల కిటికీల్లోంచి ధారాళంగా వెలుతురు పడుతోంది. దూరంగా సముద్రం, అందులో ఓ ఓడ కనిపిస్తున్నాయి. మెత్తటి కార్పెట్ పరిచి ఉంది. విశాలమైన బల్లమీద డెస్క్ టాప్, తెరచిన లేప్‌టాప్. కొద్దిగా అన్నం, మూడు వెల్లుల్లిపాయలు, అర ఉల్లిపాయ ఉన్న సత్తు ప్లేట్ ఫోటో. వెనకాల గోడకి ప్రొడక్షన్ ,ఎక్స్‌పెన్సెస్ ఛార్ట్‌లు. పోస్టిట్ మీద రాసి ఆ ఛార్ట్‌కి అతికించిన కాగితాలు. వాటిమధ్య ఆఫీస్ బల్ల వెనక గోడమీద క్లాక్‌కి అంకెల బదులు అన్నిచోట్లా 'డు ఇట్ నౌ' అని ఉంది. దాని పక్కనే తగిలించిన ఫోటో ఫ్రేమ్ లో అందమైన డిజైన్ గల బార్డర్ మధ్య టైప్ చేసిన కంప్యూటర్ ప్రింటౌట్ ఉంది. అందులో ఒకో లైన్ ఒకో ఫాంట్‌లో ఉన్నాయి.

ఓడిపోయేవారు మాత్రమే చెప్పే 10 మాటలు.

1. నేను రేపటినించి స్టార్ట్ చేస్తాను.

2. అది నా తప్పు కాదు.

3. నేనది చేయలేను.

4. ఇది సరైన పరిష్కారం కాదేమో?

5. నాకసలు టై లేదు.

6. దీన్ని ఇంతదాకా ఎవరూ చేయలేదు.

7. వాళ్ళు అదృష్టవంతులు.

8. నేను అలసిపోయాను.

9. చేయడం చెప్పినంత సులభం కాదు.

10. అదెప్పటికీ కుదరదు.

ఆద్య దాన్ని చదవడం గమనించిన చైత్ర చెప్పింది.

"అది నాకోసం కాదు. నా ముందు కూర్చునేవారికి. వారిలో ఎవరు సరిగ్గా పనిచేయకపోయినా నేను వారు చేసిన తప్పుని పాయింటర్‌తో చూపిస్తాను. ఇలా" చైత్ర ఓ లేజర్ లైట్‌ని వెలిగిస్తే ఎర్రటి కాంతి ఆ బోర్డ్ మీద పడింది. దాన్ని ఆమె తొమ్మిదోదైన 'చేయడం చెప్పినంత సులభం కాదు' వాక్యంలోని ఒకో అక్షరం ప్రసరించింది.

తర్వాత పక్క గదిలోని తన కొలీగ్స్ కొందరికి ఆద్యని పరిచయం చేసింది.

ఎన్రికో ఆఫీస్ గదిలోని బోర్డ్‌మీద ప్లాస్టిక్ అక్షరాలతో అతికించిన వాక్యం కనిపించింది.

'ఈ రోజు మాత్రమే ఇవ్వబడింది. రేపు వస్తుందనే మాట ఇవ్వబడలేదు. రేపటికి వాయిదా వేయక. ఈ రోజు నిన్నటి రేపు '

తర్వాత క్రిస్ స్మిత్ గదికి తీసుకెళ్ళింది. బల్లమీది ఫ్రేమ్ లోని తన కొడుకు ఫోటోని చూపించి పరిచయం చేసాడు.

"హి ఈజ్ మై ట్రెషర్. వాడికి పద్దెనిమిదో ఏడు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. అప్పుడు చట్టం అడ్డంకి తొలగి, తల్లి కబంధ హస్తాల్లోంచి వాడికి స్వేచ్ఛ లభిస్తుంది. వాడితో కలిసి చేపలు పడుతూ కబుర్లు చెప్తాను. మేం కలిసి వేటకి వెళ్తాం. నాకు చాలా కలలున్నాయి."

"అవన్నీ జరిగి తీరాలని దేవుడ్ని ప్రార్థిస్తాను" ఆద్య చెప్పింది.

"థాంక్స్. నాకు అలాంటి ప్రార్థనలు చాలా అవసరం" అతను చెప్పాడు.

అతని గదిలో కూడా ఓ కొటేషన్ ఉంది.

'బలంగా ఉండటం తప్ప వేరే దరి లేనప్పుడు నువ్వు ఎంత బలమైనవాడివో నీకు అర్థమవుతుంది.'

"అన్నట్లు థాంక్స్ చైత్రా" క్రిస్ స్మిత్ చెప్పాడు.

"దేనికి?"

"ఇందాక మీటింగ్‌లో నీ ట్రిక్ పనిచేసింది. అతని పక్కనే కూర్చున్నాను. పక్కన కూర్చున్నవారిని క్రిటిసైజ్ చేయడానికి కొంత సైకలాజికల్ సమస్య అడ్డు వస్తుందనే ట్రిక్ పనిచేసింది" క్రిస్ నవ్వుతూ చెప్పాడు.

"గుడ్. కంగ్రాచ్యులేషన్స్" చైత్ర అభినందించింది.

ఆఫీస్ కేంటిన్‌లో ఇద్దరూ కలిసి భోజనం చేసారు. ఛీజ్, మేకరోనీ, ఎగ్స్. అక్కడ తారసపడిన కార్లోస్ ఇద్దరినీ విష్ చేసాడు.

ఆ ఆఫీస్ వాతావరణం చూసాక ఓ లక్ష్యమంటూ లేకుండా యాంత్రికంగా చదువు కొనసాగిస్తున్న ఆద్యకి తను బాగా చదువుకుని అక్కలా మల్టీ నేషనల్ కంపెనీలో పని చేయాలని ప్రగాఢంగా అనిపించింది.

"బావుందక్కా నీ ఆఫీస్" చెప్పింది.

"నా కొలీగ్ కునూట్‌కి వెనెజులాకి బదిలీ ఐంది. రాత్రికి ఫేర్‌వెల్ పార్టీ. నువ్వు కూడా వస్తున్నావు" చైత్ర ఆఫీస్‌నించి చెల్లెల్ని ఇంటికి పంపేటప్పుడు చెప్పింది.

ఆ రాత్రి ఏడున్నరకి డేనిష్ వాళ్ళు నడిపే కంట్రీ క్లబ్‌లో జరిగే ఫేర్‌వెల్ పార్టీకి ఆద్య కూడా అక్కతో వెళ్ళింది.

"నేను ఇంతదాకా చీర కట్టుకోలేదు. మనిద్దరికీ చీర కట్టుకోవడం రాదు. ఈసారి ఇంటికి వచ్చినప్పుడు అమ్మ దగ్గర నేర్చుకోవాలి. అది మన ట్రెడిషనల్ డ్రస్" చైత్ర చెప్పింది.

"యూట్యూబ్‌లో..."

"ఇది మాత్రం యుట్యూబ్‌లో ట్యుటోరియల్లో నేర్చుకునేది కాదు. ఆ సాహసం చేయకూడదు. దారిలో ఊడితే?" చైత్ర నవ్వింది.

ఫ్రైడే మీట్‌లో కలిసినవారే కాక మరికొందరు కొత్తవాళ్ళని కూడా చైత్ర ఆద్యకి పరిచయం చేసింది.

కునూట్ స్పీచ్ ఆద్యకి నచ్చింది.

"నేను స్క్లంబర్జె కంపెనీలో చేరి పదకొండేళ్ళు పూర్తయ్యాయి. జూన్ 2007లో సమ్మర్ ఇంటర్న్‌గా చేరాను. అప్పట్నినించి నేను అనేక దేశాల్లో అనేక పొజిషన్లలో పనిచేస్తూ, ఎంతోమంది ఇంటర్నేషనల్ కమ్యూనిటీ ఆఫ్ కొలీగ్‌తో స్నేహబంధాలని పెనవేసుకున్నాను. ఈ ప్రయాణం చాలా సవాళ్ళతో కూడినదని మీకు తెలుసు. లాభదాయకమైంది కూడా. నా అనుభవాలని నెమరేసుకుని కొన్ని మీకు చెప్పాలని అనుకుంటున్నాను.

"స్క్లంబర్జెని ఓ దేశంగా చూస్తే, అందులోని మనమంతా ప్రపంచ పౌరులం. లిక్విడ్ గోల్డ్‌తో కలపబడ్డాం. ఆయిల్ వర్కర్‌గా నేను ఆయిల్ ధరలని గమనిస్తున్నాను. ప్రపంచ పోకడలని దాని నేపథ్యంలో గ్రహిస్తున్నాను. ఆయిల్ ధర ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవథని, రాజకీయాలని ఎలా ప్రభావితం చేస్తోందో చూడటం ఆసక్తిగా ఉంది. ఆయిల్ కోసం మిడిల్ ఈస్ట్‌లో అగ్ర రాజ్యాల మద్దతుతో జరిగే యుద్ధాలు, క్రియాత్మక నిర్ణయాలు, కొందరు దేశాధినేతలని పదవీచ్యుతులని చేయడం, చంపడం, క్రైసిస్ మొదలైనవి నాకు అర్థమౌతున్నాయి. ఇక్కడ పనిచేస్తూ ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాను. ప్రదేశం ఏదైనా కావచ్చు. కాని మనుషులే

ముఖ్యం. పనిలో సమర్ధతకి, నీతికి, జాతీయతకి ఎలాంటి సంబంధం లేదని నాకు ఈ ఉద్యోగంలో చేరాక బోధపడింది. అవన్నీ వ్యక్తిగత ఆపాదనలే. దేశాలమీద నేను గమనించిన ముద్రలు తప్పని నా కొలీగ్స్ ద్వారా అర్ధమైంది. మిడిల్ ఈస్ట్, ఆఫ్రికానించి వచ్చినవారిలో వెస్టనర్స్ కన్నా ఎక్కువ ఓపెన్ మైండ్‌గలవారు నాకు చాలాసార్లు తారసపడ్డారు. సిరియా, పాకిస్తాన్‌లాంటి ఇస్లామిక్ దేశాలనించి వచ్చిన మత ఛాందసత్వం లేనివారు కూడా" ఆగి అతను కొద్ది క్షణాలు నవ్వుతూండిపోయి తర్వాత కొనసాగించాడు.

"నేను ఏ దేశంలో తిన్నా, నాకు అర్ధమైంది, వారి ఆహారంలో కూడా మనకి చిన్నప్పటినించీ అలవడ్డ సంప్రదాయ ఆహారంలోలా ప్రొటీన్స్, కార్బ్స్, విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. అవన్నీ పౌష్ఠికాహారాలే. ఫ్రాన్స్‌లో క్రెప్ అన్నదాన్ని రష్యన్స్ బ్లినీ అంటారు. ఇండియన్స్ దోశె అంటారు. మేము బ్రెడ్‌ని దేంతో చేస్తామో దాంతోనే మిడిల్ ఈస్ట్‌లో చేసేదాన్ని పీటా బ్రెడ్ అంటారు. రష్యన్స్ కరవాయ్ అని, ఈజిప్ట్ లో ఆయిష్ బలాదీ అని, స్పెయిన్‌లో బ్రగాడో, ఫ్రాన్స్‌లో బేగెట్ అని, ఇండియాలో రోటీ అని, ఆఫ్ఘనిస్థాన్‌లో పరోటా అని అంటారు. అన్నిటికన్నా ముఖ్యం మీలోని కొందరితో ఏర్పడిన జీవితకాలపు స్నేహాన్ని నేను విలువైనదిగా భావిస్తున్నాను. మనం తప్పక మరోసారి మరెక్కడో కలుస్తామనే దృఢ విశ్వాసంతో మీనించి శెలవు తీసుకుంటూ, ఆఫ్రికానించి సౌత్ అమెరికాలోని వెనెజువెలాకి వెళ్ళిపోతున్నాను. ముఖ్యంగా అది పేద దేశమైనా, ధనిక దేశమైనా ప్రతీ దేశంలో స్థానిక బ్రూవరీలు ఉన్నాయి. షైనర్, రెగాబ్, లా స్పెజియా, షిచా, బాప్ బాప్, గజా, హంసా, ఇంకా ఎన్నో. బీర్ ప్రియుడినైనా నాకు సాయంత్రం అయేసరికి అవన్నీ చక్కటి ఆనందాన్నిస్తాయి. థాంక్ యు ఒన్ అండ్ థాంక్ యు ఆల్."

అంతా లేచి నిలబడి రెండు నిమిషాల సేపు నవ్వుతూ చప్పట్లు కొట్టారు. ఆ ప్రసంగం విన్న ఆద్యకి అంతర్జాతీయత అంటే ఏమిటో చూచాయగా బోధపడింది. తర్వాత డ్రింక్స్, భోజనాలు.

అంతా ఒకేసారి 'ఓ ' అని పాడుతూ ఆల్కహాల్ గ్లాస్‌లని తాటించి, నోటి దగ్గరకి తీసుకెళ్ళి 'హై స్కాల్' అని అరిచారు. తర్వాత ఓ పాట పాడారు.

"అది నార్వేజియన్స్ ఛీర్స్ చెప్పే పద్ధతి" చైత్ర చెప్పింది.

అక్కడ తారసపడిన అలెక్సీ కుటుంబాన్ని చైత్ర మర్నాడు డిన్నర్‌కి ఆహ్వానించింది.

## 26

ప్రవర్ధన, సంజీవ నిష్టగా కదలకుండా సత్యనారాయణ వ్రతాన్ని చూసారు. ఐదో కథ కూడా ముగించేసరికి కేటరర్ వేన్‌లో భోజనాలు వచ్చాయి. లోపలికి ఓ అందమైన నొక్కుల జుట్టు అమ్మాయిని చూసిన ప్రవర్ధన అంతదాకా తను ఎన్నడూ అంత పెద్ద జడని చూడలేదని అనుకుంది. ఆమెకి ఓ టిఫిన్ కేరేజ్‌లో అన్నం, ఇతర పదార్ధాలు పెట్టి ఇవ్వడం చూసిన ప్రవర్ధన తన మేనకోడలుని అడిగింది.

"ఆ అమ్మాయి ఎవరు?"

"పేరు దక్ష. బి బ్లాక్‌లోని మా అమ్మ కజిన్ ఇంట్లో హెల్పర్‌గా మూడు నెలల క్రితం చేరింది. ఆ కజిన్‌కి అకస్మాత్తుగా ఓ తెల్లవారుఝామున బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చేతులు, కాళ్ళు కదిలకలు పోయాయి. దాంతో ఇంట్లో వంటకి, ఆవిడ అన్ని పనులూ చూడటానికి ఓ ఏజన్సీ దక్షని పంపింది. నెలకి ఇరవై ఒక్క వేల జీతం. కాని అందులో ఏడువేలు ఆ ఏజన్సీ వాళ్ళు తీసుకుని మిగిలింది దక్షకి ఇస్తారు. ఫిజియో థెరపిస్ట్ కూడా రోజూ ఉదయం వచ్చి ఎక్సర్‌సైజెస్ చేయిస్తాడు. అతనికి రోజుకి వెయ్యి ఇస్తారు."

"అయ్యో! ఐతే నేనోసారి వెళ్ళి ఆవిడని పరామర్శి..."

"ఒద్దొద్దు. ఆవిడ తనని ఎవరైనా చూడటానికి వస్తే అవమానంగా ఫీలవుతోంది."

"సరేలే."

"పాపం. దక్ష కూతురు ఎనిమిదేళ్ళ పిల్లకి మూర్ఛవ్యాధి. ఖరీదైన మందులు వాడాలి. ఆ పాపని అమ్మమ్మ దగ్గర వదిలి ఈ ఉద్యోగానికి వచ్చింది. చాలా అప్పు చేసి వైద్యం చేయించాక ఇక అప్పు దొర్కని స్థితిలో తనకి తెలిసిన ఏకైక పనికోసం అత్తిలినించి హెల్పర్‌గా ఇక్కడికి వచ్చి చేరింది. వాళ్ళాయన కూడా ఇక్కడే రెండు కిలోమీటర్ల దూరంలోని జనప్రియ హోమ్స్ లో వృద్ధాప్యంలో కదల్లేని ఓ ముసలాయనని చూసుకోడానికి వచ్చాడు. ఇద్దరి జీతంలోంచి కొంత అప్పు తీర్చి కొంత పిల్ల మందులకి వాడుతున్నారు."

"అయ్యో పాపం! తల్లో చోట. తండ్రో చోట. కూతురో చోట. చిన్న వయసులో ఎంత కష్టం వచ్చింది" ప్రవర్ధన బాధగా చెప్పింది.

"అవునత్తా. దురదృష్టం కదా! మొగుడూ పెళ్ళాలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నా ఒకర్నొకరు చూసుకుని ఓ అరగంట మాట్లాడుకునేది నెల్లో ఓ ఆదివారమే. అతను తన భార్య దగ్గరకి వెళ్ళడానికి ఆ ముసలాయన పిల్లలు అంతకుమించి అనుమతిని ఇవ్వలేదు."

"వాళ్ళసలు మనుషులేనా?"

"మనుషుల్లో కొందరు కొన్ని విషయాల్లో మనుషులు కారు. కొన్ని విషయాల్లో అవును. వాళ్ళు ఆ చిన్నపిల్లకి కొన్ని మందులని కొనిస్తుంటారు."

"దక్షకి నేనో పదివేలు ఇస్తాను. ఆమెని తీసుకురా" ప్రవర్ధన వెంటనే కోరింది.

"అలాగే. అది మంచి పనత్తా."

కొద్ది నిమిషాల్లో ఆ పిల్ల ప్రవర్ధన మేనకోడలితో వచ్చింది. ఆమె మొహంలో స్వల్పంగా సిగ్గు, స్పష్టంగా మొహమాటం ప్రవర్ధనకి కనిపించాయి.

"నమస్కారమండి" ఆమె చేతులు జోడించి బలహీనంగా చూస్తూ చెప్పింది.

"మా అమ్మాయి నాకు నీ గురించి చెప్పింది. నీకో పదివేలు ఇస్తాను. నీకు ఫోన్‌పే ఉందా?" ప్రవర్ధన సూటిగా అడిగింది.

"లేదండి. మా అమ్మాయితో మాట్లాడటానికి నాకు బేసిక్ ఫోన్ మాత్రమే ఉందండి. మా ఆయనకు గూగుల్ పే ఉంది."

"ఐతే నంబర్ చెప్పు" తన హేండ్‌బేగ్‌లోంచి మొబైల్‌ని బయటకి తీస్తూ ప్రవర్ధన అడిగింది.

"కాని ఎప్పటికి తీరుస్తామో కదండి? ఇప్పటికే చాలా అప్పుల్లో ఉన్నాము. ముందు వాటిని తీర్చాలి. అందుకే నేను కూడా పని చేయాల్సి వచ్చింది."

"అప్పు, తీర్చడం లాంటివేం మనసులో ఉంచుకోకుండా తీసుకోమ్మా. నీకెందుకు?"

"అయ్యో! పదా? పాతికా? పదివేల రూపాయలు. అది చాలా పెద్ద మొత్తమండీ."

"మరేం ఫర్వాలేదు. తీర్చమని అడగడం లేదుగా."

"కాని ఉత్తినే ఇలా.." నసిగింది.

"చూడు దక్షా! పెద్దావిడ మాట విను" మేనకోడలు కూడా మందలింపుగా చెప్పింది.

"పోనీ తీర్చాలనుకుంటే అన్ని అప్పులూ తీర్చాక చివరగా నాది తీరుద్దువు కానిలే. మీ వారి నంబర్ చెప్పు" ప్రవర్ధన అడిగింది.

దక్ష సిగ్గుపడుతూనే అతని మొబైల్ నంబర్ చెప్పింది. ఆ నంబర్‌కి ప్రవర్ధన పదివేల రూపాయలని గూగుల్‌పే చేసింది.

"చాలా థాంక్సండి."

ఆమె కళ్ళు చమర్చడం ఇద్దరూ గమనించారు.

"ఫర్వాలేదమ్మాయి. నా కూతురులాంటిదానివి. నీ వయస్సు మా పెద్దమ్మాయి వయసుకన్నా ఒకటి, రెండేళ్ళు ఎక్కువుండచ్చు. అంతే."

ప్రవర్ధన ఫోన్ మోగింది. డబ్బు పంపిన నంబర్ నించి. ఆవిడ దాన్ని ఆన్సర్ చెయ్యగానే ఓ మగ కంఠం పలికింది.

"మీ నంబర్నించి పొరపాటున నాకో పదివేలు గూగుల్‌పే ద్వారా వచ్చాయి. తిరిగి పంపిస్తున్నాను."

"పొరపాటు కాదది. ఉండు. మీ ఆవిడతో మాట్లాడు."

ఫోన్‌ని కొంగుతో తుడిచి దాన్ని దక్షకి ఇచ్చింది.

"ఫర్వాలేదు. కాసేపు మాట్లాడాక ఇవ్వు. బాల్కనీలోకి వెళ్ళి మాట్లాడు" మేనకోడలు చెప్పింది.

భోజనాలయ్యాక ఇంటికి తిరిగి వెళ్తూ ప్రవర్ధన జరిగింది చెపితే సంజీవ చెప్పాడు.

"మంచి పని చేసావు. ఓ రచయిత రాసిన వ్యాసాన్ని ఈ మధ్య ఓ భక్తి పత్రికలో చదివాను. క్రిష్టియానిటీలో తోటి జీవులకి, మనుషులకి ఇలాంటి సేవని బోధిస్తే, హిందూమతంలో కేవలం దేవుడి మీద భక్తినే ప్రధానంగా బోధిస్తున్నారట. దాంతో హిందువులు తోటి మనుషులకి దానం చెయ్యాలంటే పుష్కరాలు, ఎవరైనా మరణించడం, పుణ్యక్షేత్రాలకి వెళ్ళడంలాంటి సందర్భాలు వచ్చేదాకా చెయ్యరట. క్రిస్టియన్స్‌కి ఇలా సీజన్ లేదు. అమెరికన్ చర్చ్‌లకి ఇచ్చే ఫండ్స్ ఆఫ్రికాలోని బీదలకి అందుతోందిట."

"నిజమే. మనవాళ్ళు మహాత్ములుగా భావించేవారి పాద పూజలకి లక్షలు చెల్లిస్తారు. కాని కారు డ్రైవర్ భార్యకి కానుపుకి ఓ పదివేలు సహాయం చెయ్యడానికి నిరాకరిస్తారు" ప్రవర్ధన చెప్పింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in